


భూపాలపల్లిలో ఎన్నికల విధులపై ఏర్పాటుచేసిన సమావేశంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది

- బరిలో 52మంది అభ్యర్థులు
- సెగ్మెంట్ పరిధిలోని మొత్తం ఓటర్లు 4,61,806
- మొత్తం 605 కేంద్రాల్లో ప్రక్రియ
- ఉమ్మడి వరంగల్‌లో 1,73,413 ఓటర్లు.. 227 సెంటర్లు
- పోలింగ్ ముగిసిన తర్వాత జిల్లాకేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు
- అక్కడినుంచి నల్లగొండలోని స్ట్రాంగ్‌రూములకు తరలింపు
- జూన్ 5న ఓట్ల లెక్కింపు
- సెగ్మెంట్‌లో ప్రతిసారి బీఆర్ఎస్ విజయం

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

## నేడే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక



వరంగల్‌లో ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌తో వెళ్తున్న సిబ్బంది



జనగామలో బ్యాలెట్ పేపర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామలో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది



వరంగల్ కలెక్టరేట్ నుంచి పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న అధికారులు

వరంగల్, మే 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనున్నది. ఎమ్మెల్సీ నియోజక వర్గ పరిధిలో 12 జిల్లాలు ఉండగా జిల్లాకో డిస్ట్రిబ్యూటరీ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన సామగ్రితో కేంద్రాలకు బయల్దేరారు. సెగ్మెంట్ పరిధిలో మొత్తం 695 కేంద్రాలు ఉండగా, పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను తొలుత జిల్లాకేంద్రాల్లోని డిస్ట్రిబ్యూటరీ సెంటర్లకు తీసుకొచ్చి అక్కడినుంచి నల్లగొండలోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలిస్తారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఉప ఎన్నికలో మొత్తం 52మంది బరిలో ఉండగా బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీజేపీ తరపున గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున చింతపండు నవీన్ పోటీలో ఉన్నారు.

గ్రాడ్యుయేట్స్ ఉప ఎన్నిక ప్రచార సరళి గతంలో ఎప్పుడూ లేనంత ఉత్సాహం కనిపించింది. అసెంబ్లీ, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ ఎన్నిక జరుగనుండడం.. ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో 12 జిల్లాలు, 34 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2023 నవంబర్ 1కి మూడేండ్ల ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటు వేసే అవకాశం కల్పించింది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,87,007 మంది పురుషులు, 1,74,794 మంది మహిళలు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో 1,73,413 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు వేసేందుకు వీలుగా 227 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని ఓటర్లు

| జిల్లా | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| సిద్దిపేట | 3,118 | 1,553 | 00 | 4,671 |
| జనగామ | 14,862 | 8,457 | 01 | 23,329 |
| హనుమకొండ | 25,608 | 17,875 | 00 | 43,483 |
| వరంగల్ | 26,907 | 16,687 | 00 | 43,594 |
| మహబూబాబాద్ | 22842 | 11,917 | 00 | 34,759 |
| ములుగు | 6,558 | 3,679 | 00 | 10,237 |
| భూపాలపల్లి | 7,956 | 4,504 | 00 | 12,460 |
| భద్రాద్రి కొత్తగూడెం | 22,486 | 17,412 | 00 | 39898 |
| ఖమ్మం | 50,517 | 33,085 | 04 | 83,606 |
| యాదాద్రి భువనగిరి | 20,740 | 13,186 | 00 | 33,926 |
| సూర్యాపేట | 34,043 | 17,250 | 00 | 51,293 |
| నల్గొండ | 51,370 | 29,189 | 00 | 80,559 |

### మొదటినుంచీ గులాబీ కోట..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి తిరిగి ఏర్పడినప్పటి నుంచి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్నది. ఈ ఎమ్మెల్సీ సెగ్మెంట్‌కు జరిగిన ప్రతి సాధారణ ఎన్నికలో, ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలిచింది. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసన మండలిని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా అదే ఏడాది వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన సాధారణ ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు 2008లో పదవులకు రాజీనామా చేశారు. ఇలా ఖాళీ అయిన క్రమంలో 2009లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కపిలవాయి దిలీప్‌కుమార్ రెండోసారి గెలిచారు. అలాగే 2015 మార్చిలో జరిగిన సాధారణ ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిచారు. పదవీకాలం ముగియడంతో 2021 ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సాధారణ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలోనూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఇప్పుడు గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితంలో ఆనవాయితీ కొనసాగే పరిస్థితి కనిపిస్తున్నది.



వరంగల్‌లో సామగ్రితో పోలింగ్ సెంటర్లకు వెళ్తున్న సిబ్బంది



ములుగులో సామగ్రితో బస్సులో బయల్దేరుతున్న సిబ్బంది



హనుమకొండలో సామగ్రితో పోలింగ్ సెంటర్లకు వెళ్తున్న సిబ్బంది



దేవరుప్పులలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో వ్యవహరించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్/దేవరుప్పుల, మే 26: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో యువకుడు, విద్యావంతుడు బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి, దేవరుప్పుల మండలాల్లోని బీఆర్ఎస్ కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వీటిని నెరవేర్చలేదని విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో మళ్లీ నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ యత్నిస్తున్నాయని తెలిపారు. నిజాయితీపరుడు, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పెద్దల సభకు పంపేందుకు పట్టభద్రులు ఓటేసి గెలిపించాలని ఎర్రబెల్లి కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులు, పార్టీ నాయకుల అండతో రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయమైందన్నారు. పాలకుర్తిలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి పల్లా సుందర్‌రామిరెడ్డి, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, జర్పుల బాలునాయక్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, కమ్మగాని నాగన్న, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, చిలుకమారి నాగేశ్వర్ పాల్గొన్నారు. దేవరుప్పులలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, ప్రధాన కార్యదర్శి చింత రవి, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఈదునూరి నర్సింహారెడ్డి, బస్వ మల్లేశ్, కొల్లూరుసోమయ్య, ఏల సుందర్, జోగు సోమనర్సయ్య,ధరావత్ రాంసింగ్, కుతాటి నర్సింహులు, బిళ్ల యాదవరెడ్డి, అనంతోజు కృష్ణమూర్తి, ఆలకుంట్ల యాదగిరి, తిరుమలేశ్ పాల్గొన్నారు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్లాట్‌ఫాంపైకి వచ్చిన ప్రయాణికులు

# రైల్వే ప్రయాణికుల ఆందోళన

- ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేయని ఏసీలు
- వరంగల్ రైల్వేస్టేషన్‌లో 2.46 గంటలపాటు నిలిపివేత
- మరమ్మతుల అనంతరం రాత్రి 10.55 గంటలకు బయలుదేరిన రైలు

ఖిలావరంగల్, మే 26: రైల్వే ప్రయాణికులు ఆందోళన చేసిన ఘటన ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే ప్రయాణికుల కథనం ప్రకారం.. న్యూఢిల్లీ నుంచి విశాఖపట్టణం వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ (నంబర్ 20806) రైలులో సాంకేతిక లోపం వల్ల ఏసీపీలు పని చేయలేదు. దీంతో ప్రయాణికులు ఆందోళన చేశారు. రైల్వే అధికారులు రైలును వరంగల్ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అయితే, వరంగల్ రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 5.29 గంటలకు రావాల్సి ఉండగా, రాత్రి 7.09 గంటలకు చేరుకుంది. కాగా, ఏసీలు ఎంతకూ రిపేర్ కాకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రైల్వే ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ప్రత్యామ్నాయంగా ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకోను ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు అమర్చి రాత్రి 10.55 గంటలకు రైలును వరంగల్ నుంచి పంపించారు. ఏసీలు పని చేయకపోవడం వల్ల ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ రైల్వేస్టేషన్‌లో 2.46 గంటలపాటు నిలిచిపోయినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

లోకం చెరువులో తగ్గిన నీటిమట్టం





చనిపోయిన చేపలు

# చేపల కోసం చెరువు ఖాళీ

- తూములు ఎత్తి నీరు వదిలిన వైనం
- లోకంచెరువు నుంచి వృథాగా పోతున్న వేలాది క్యూసెక్కుల నీరు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో మత్స్యకారుల ఇష్టారాజ్యం

ములుగు, మే 26 (నమస్తే తెలంగాణ): చేపలు పట్టేందుకు చెరువులోని నీటిని ఖాళీ చేస్తున్నారు. వేలాది క్యూసెక్కుల నీటిని వృథాగా వదిలేస్తున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో అతిపెద్ద జలాశయమైన లోకంచెరువు నుంచి కొన్ని రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. చెరువులో నీటిమట్టం ఎక్కువగా ఉన్నందున చేపలు పట్టేందుకు వీలు కాకపోవడంతో అధికారులు మత్స్యకారులకు వంతపాడి నీరంతా తూము గేట్లు ఎత్తి కాల్వ ద్వారా బయటకు పంపుతున్నారు. ఆయకట్టు పంటలకు అవసరమైనప్పుడు మాత్రమే నీటిని విడుదల చేయాలనే నిబంధనలు ఉండగా అధికారులు అదేమీ పట్టించుకోకుండా, మత్స్యకారుల కాసులకు కక్కుర్తి పడి నీటిని వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. చెరువులోని నీరు వృథాగా పోతుండగా ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలుకల బాధకు ఇల్లు తగులబెట్టుకున్న చందంగా చేపలు పట్టేందుకు పంటలకు అవసరమైన నీటిని వృథాగా బయటకు వదలడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. చెరువులో నుంచి నీరు బయట పోతుండగా వందల సంఖ్యలో చేపలు సైతం చనిపోయి కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే చెరువు నీరంతా వృథాగా పోతోందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

### వృథాగా పోతున్న నీరు

కాకతీయుల కాలం నాటి లోకంచెరువు కింద 3వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులోని నీరు రెండు పంటలకు సరిపోతాయి. ఐదేళ్లుగా ఎండా కాలంలో సగం కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటోంది. మూడేళ్లుగా వర్షాకాలం ప్రారంభంలోనే మత్తడి పోస్తూ ఉంటుంది. ఐదేళ్ల కింద చేప పిల్లలు పోసిన కాంట్రాక్టర్ రెండేళ్లు చెరువులో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో చేపలు పట్టలేదు. దీంతో వానాకాలం ప్రారంభంలో చెరువు మత్తడి పడినప్పుడు చేపలు దిగువకు వెళ్లిపోయాయి. చేపలు పోసిన కాంట్రాక్టర్ ప్రస్తుతం చేపలు పట్టుకునేందుకు నీటిని తూముల ద్వారా కాల్వల్లోకి వదులుతుండడంతో దిగువనున్న తోపుకుంట పూర్తిగా నిండింది. మిగిలిన నీళ్లు పొలాలకు వెళ్తోంది. ఈ క్రమంలో నీరంతా వృథాగా పోతోంది.

### షెట్టర్ల లీకేజీలతోనే..

చెరువు తూముల వద్ద షెట్టర్ల లీకేజీ కారణంగా నీళ్లన్నీ కాల్వలోకి వెళ్తున్నాయి. ఎన్నికల విధుల్లో ఉన్నందున లీకేజీ విషయం నా దృష్టికి రాలేదు. ఎన్నిక తర్వాత షెటర్లకు మరమ్మతులు చేయించి లీకేజీలను అరికడుతాం.

– రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ డీఈ



పంట పొల్లాలోకి చేరిన చెరువు నీరు

## ఎంజీఎంలో విద్యుత్ మరమ్మతులు

కాశీబుగ్గ, మే 26: వరంగల్ ఎంజీఎం దవాఖానలో విద్యుత్ మరమ్మతులు చేపట్టారు. మంగళవారం రాత్రి ఎంజీఎంలో సుమారు ఐదు గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీలు జారీ చేశారు. అలాగే, నివేదిక అందించాలని కోరగా, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి సమర్పించారు. ఈ మేరకు ఎంజీఎం దవాఖానకు విద్యుత్ సామగ్రిని తీసుకొచ్చి మరమ్మతు పనులు చేపట్టారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

## పాకాల సరస్సు ఒడ్డున మొసలి

ఖానాపురం, మే 26: పాకాల సరస్సు ఒడ్డున భారీ మొసలి ఆదివారం సేదతీరుతూ పర్యాటకులకు కనిపించింది. సరస్సులో నీరు అడుగంటడంతో మధ్యాహ్న సమయంలో మొసళ్లు ఒడ్డుకు వస్తున్నాయి. మనుషుల అలికిడితో వెంటనే సరస్సులోకి జారుకుంటున్నాయి. పర్యాటకులు సరస్సులోకి దిగి మొసళ్ల బారిన పడొద్దని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



సరస్సులో ఒడ్డున సేదతీరుతున్న మొసలి